క్లుప్తంగా

వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులు



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: మండలంలో కేశవరం, రాజవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ఖరీఫ్ వరి నారుమడి యాజమాన్యం, పంట నమోదుపై అవగాహన కల్పించారు. పీఎండీఎస్ కిట్లు, పచ్చిరొట్ట విత్తనాలు, విత్తన శుద్ధి గురించి వివరించారు. నేలలు స్వభావం, మట్టి నమూనాల ప్రాముఖ్యత, ఎరువుల యాజమాన్యం గురించి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీ విశ్వనాథ్, శాస్త్రవేత్త శ్రీహరి, ఎంపీఈవో శరత్ కుమార్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్



ఇసుక లోడు లారీ

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులో రికార్డులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం ఆర్‌టీఏ అధికారులు సీజ్ చేశారు. వాహన తనిఖీల్లో భాగంగా పూడిమడక రోడ్డులో వెళ్తున్న పలు వాహనాలను ఆర్‌టీఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని గుర్తించి కేసు నమోదు చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం




కైలాసపట్నంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి విజయలక్ష్మి

కోటవురట్ల: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ఉంటుందని కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవడం, మంచి ఆహార అలవాట్లు చేసుకోవడం ద్వారా వ్యాధులను దూరం పెట్టవచ్చని తెలిపారు. చెత్తను ఇష్టానుసారంగా రోడ్లపై వేయకుండా చెత్త కుండీల్లో మాత్రమే వేయాలన్నారు. ఆరుబయట రోడ్లపై బహిరంగ మల విసర్జన అలవాటును మానుకోవాలని, లేదంటే వ్యాధులు వెంటాడుతాయని హెచ్చరించారు. సకాలంలో ఇంటి పన్నులను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య ఉపకేంద్రం సీహెచ్‌వో తులసి, సచివాలయం మహిళా పోలీసు లలిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిరణ్, ఆశ కార్యకర్తలు నూకరత్నం, చండీ దేవి, వార్డు మెంబర్ నూకరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక

మునగపాక: స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి బుధవారం ఎన్నిక జరుగుతుందని ఈవోపీఆర్డీ సోమరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప సర్పంచ్ పదవి ఖాళీగా ఉండడంతో పలుమార్లు అధికారులు ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నిక జరిగే రోజున వార్డు సభ్యుల కోరం లేకపోవడంతో తరచూ వాయిదా పడుతూ వస్తోంది. పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీ



ఎరువులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎస్.రాయవరం: నిబంధనల మేరకు ప్రైవేటు దుకాణాల్లో ఎరువులు విక్రయించాలని విజిలెన్స్ ఏడీఏ బి.సింహాచలం ఆదేశించారు. అడ్డురోడ్డులోని మనగ్రోమోర్ ఎరువులు దుకాణంలో మంగళవారం విజిలెన్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఇక్కడ ఎరువుల స్టాక్ వివరాలు నోటీస్ బోర్డులో విధిగా ఉండాలన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ టీమ్ మెంబర్ కె. మహారాజన్, టెక్నికల్ ఆఫీసర్ సరోజిని, వ్యవసాయాధికారి సౌజన్య తదితరులు ఉన్నారు.

చుట్టేస్తున్న సీజనల్ వ్యాధులు



కోటవురట్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

కోటవురట్ల: వ్యాధుల దాడితో ప్రజలు మంచం పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ముప్పేట దాడి చేస్తున్నాయి. పల్లెలను జ్వరం, డెంగ్యూ, డయేరియా, మలేరియా, చికెన్ గున్యా చుట్టుముడుతున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా రోగ పీడితులే కనిపిస్తున్నారు. వ్యాధుల విజృంభణతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పేదలు చికిత్స భారంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. పల్లెల్లో పారిశుధ్య లోపంతో ఈ పరిస్థితి నెలకొంది.

రోజురోజుకు వ్యాధుల విజృంభణ

పలు గ్రామాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలిపోవడంతో చెత్త కుప్పలు రహదారులను అలంకరిస్తున్నాయి. ఈ పరిస్థితులకు తోడు రహదారుల్లో బహిరంగ మలవిసర్జన వ్యాధులను రా రమ్మంటున్నాయి. అపారిశుధ్య పరిస్థితులకు వాతావరణం మార్పు తోడవ్వడంతో వ్యాధులు ప్రతీ గ్రామాన్ని చుట్టేస్తున్నాయి. ఇంటికో జ్వరం, చికెన్ గున్యా అన్నట్టుగా రోగులు విలవిల్లాడుతున్నారు. సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వ్యాధుల విజృంభణ రోజురోజుకు పెరుగుతోంది. వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలు ఆస్పత్రులకే పరిమితమవుతున్నాయి. పల్లెల్లో వైద్య సిబ్బంది జాడ లేకపోవడంతో రోగులు వ్యాధులతో సతమతమవుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

ఓపీ 360 నమోదు

సాధారణంగా స్థానిక సీహెచ్‌సీలో రోజుకు ఓపీ వంద వరకు ఉంటే, వారం రోజులుగా ఈ సంఖ్య రెట్టింపయ్యింది. రోజూ ఓపీ 200 దాటుతోంది. సోమవారం ఒక్కరోజే ఓపీ 360 నమోదైంది. ప్రస్తుతం సీహెచ్‌సీలో ఇన్‌పేషెంట్లు 64 మంది ఉండగా, ఇందులో 12 మంది వాంతులు, విరేచనాల లక్షణాలతో డయేరియాతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మిగిలిన 52 మంది జ్వరం, చికెన్ గున్యా లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. లింగావురం, గవరపేట, రాజుపేట, రామన్నపాలెం, కైలాసపట్నం, కె.వెంకటాపురం, సుంకపూరు, జల్లూరు, తంగేడు, కోటవురట్ల, చౌడువాడ ప్రాంతాలలో ఎక్కువ కేసులు నమోదవుతుండగా జ్వరం, చికెన్ గున్యా, డెంగ్యూ వ్యాధులతో బాధపడుతున్నారు. రాజుపేట శివారు రామన్నపాలెంలో సుమారు 10 మంది డెంగ్యూతో వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. నర్సీపట్నం, తుని, అనకాపల్లి, మాకవరపాలెం, విశాఖపట్నంలోని పలు ఆస్పత్రులలో రోగులు చికిత్స పొందుతున్నారు. రోజురోజుకు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.



మాకవరపాలెంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భాస్కరరావు



మాకవరపాలెంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలుడు

డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉన్నాయి..



ప్రతీ గ్రామంలో డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉన్నాయి. మా రామన్నపాలెంలో చాలా మంది జ్వరాలు, డెంగ్యూ, చికెన్‌గున్యాతో బాధపడుతున్నారు. పేదలు ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స చేయించుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడగడపకు వైద్యం అందేది. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో వైద్యులు ఇళ్లకే వచ్చేవారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనే జగనన్న ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల ప్రాణాలను కాపాడారు.

– కొల్లు గోపాలకృష్ణ, రామన్నపాలెం

చికున్ గున్యా ఎక్కువగా ఉంది..



సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయి. వారం రోజులుగా గతంలో కంటే రోగుల సంఖ్య పెరిగింది. ప్రతీ రోజూ ఓపీ 200 దాటుతోంది. ఎక్కువగా చికున్ గున్యా, జ్వరం కేసులు వస్తున్నాయి. చాలా గ్రామాలలో ఎక్కువగా చికెన్ గున్యాతో బాధపడుతున్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి వడకట్టిన నీటిని తాగడంతో పాటు పరిశుభ్రత పాటించాలి. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా చికిత్స చేయించుకోవాలి.

– డాక్టరు ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, కోటవురట్ల

వైఎస్సార్ సీపీ హయాంలో వైద్యానికి పెద్దపీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యానికి పెద్ద పీట వేసి ప్రతీ గ్రామ పంచాయతీలో వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించి చికిత్స అందించేవారు. అంతే కాకుండా ఫ్యామిలీ డాక్టరు కాన్సెప్ట్‌తో వైద్యులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య సేవలందించేవారు. ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ స్థాయిలోనే వ్యాధులను కట్టడి చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వైద్య సిబ్బంది వెల్‌నెస్ సెంటర్లు, ఆస్పత్రులకే పరిమితమయ్యారు. వైద్య శిబిరాల జాడేలేదు. దాంతో పల్లెలు వ్యాధులతో వణికిపోతున్నాయి. రోగులు మంచం పట్టి ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్యం మెరుగుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడమే కాకుండా పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. లేదంటే పరిస్థితి చేయి దాటిపోయి మృత్యుఘోష వినిపించే ప్రమాదం ఉంది.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పాటుపడాలి



యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీని కలిసిన మునగపాక మండల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

- హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ

మునగపాక: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ కోరారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలన్నారు. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ధర్మశ్రీని మంగళవారం మండల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. నేటి నుంచి ప్రతీ నాయకుడు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. అర్హులైన ప్రతీ పేదవానికి జగన్‌మోహన్‌రెడ్డితోనే న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, కర్రి పెదబ్బాయి, సుందరపు తాతాజీ, ఇందల నాయుడు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, కాండ్రేగుల జగన్, పెంటకోట హరేరామ, ఆడారి కాశీబాబు, పెంటకోట అప్పలనాయుడు, గుంట్ల అప్పారావు, రాయి బుజ్జి, జోగినాయుడు, పరమేష్, కోనపల్లి రామ్మోహనరావు, పిట్టా మంగారెడ్డి, కన్నం నాయుడు, పల్లె అప్పలనాయుడు, చదరం రాము, అరిగా శ్రీనివాసరావు, కన్న, భాస్కరరావు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెం గ్రామ కమిటీ నియామకం



గ్రామ కమిటీతో వైఎస్సార్ సీపీ నాయకులు

ఎస్.రాయవరం: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సమన్వయంతో పని చేసే సమయం ఆసన్నమైందని పార్టీ మండలాధ్యక్షుడు, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. పార్టీ అధినేత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు గ్రామ కమిటీల నియామకం ప్రారంభించామన్నారు. ముందుగా మండలంలో బంగారమ్మపాలెం గ్రామ కమిటీని మంగళవారం నియమించామన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉమ్మిడి నారాయణరావు, ఉపాధ్యక్షుడిగా గరికిన నాగరాజులను నియమించినట్టు చెప్పారు. కూటమి పాలనపై ఏడాది వ్యవధిలోనే వ్యతిరేకత మొదలైందన్నారు. సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో చంద్రబాబు అమలు చేయలేదని విమర్శించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లో కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు చోడిపల్లి కోదండ, మైలపల్లి రాజారావు, నాయకులు పోతురాజు, చోడిపల్లి గోవిందు, కారే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కార్మికుల రాకపోకలు

అచ్యుతాపురం రూరల్: రోజూ పరిశ్రమలకు హాజరయ్యే కార్మికులు అతి ప్రమాదకర పరిస్థితిలో రాకపోకలు చేస్తున్నారు. పలుమార్లు అధికారులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరబొమ్మల మాదిరిగా కార్మికులతో పరిశ్రమల్లో పనిచేయించుకోవడమే కానీ వారి భద్రతాపరమైన చర్యలు యాజమాన్యాలు తీసుకోవడం లేదని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించకుండా వాహనాల్లో పరిమితికి మించి పదుల సంఖ్యలో తరలిస్తున్నారు. అనుకోని దుర్ఘటనలు జరిగితే కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని గ్రహించకపోవడం అత్యంత దుర్మార్గమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కార్మికులను యలమంచిలి రహదారి సాయి ప్రియా లే-అవుట్‌లో పరిమితికి మించి తరలింపు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్: మండలంలోని 20 గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, దిబ్బపాలెం, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్, ఆవసోమవరం, ఆవరాజాం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

రేపు కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం ఎస్.ఎస్. పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, వాకపాడు, వెంకటాపురం, లింగరాజుపాలెం, సర్వసిద్ధి, సైతారుపేట, జేవీపాలెం, బసవపాడు తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్



తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: మండలంలోని పాటిపల్లి పంచాయతీ పరిధిలో భూముల రైతులకు ఎటువంటి న్యాయం చేస్తారో చెప్పాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం పాటిపల్లి పంచాయతీ పరిధిలో 600 ఎకరాల భూమిని సర్వే చేస్తున్నట్లు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలంటూ అధికారులు చెబుతున్నారు. మంగళవారం నారాయుడుపాలెం సచివాలయ ప్రాంగణంలో తహసీల్దార్ పి.సత్యనారాయణ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2013 భూ సేకరణ చట్టంపై ఏ పరిశ్రమలు ఎక్కడకు వస్తున్నాయో తెలియపరచాలని, అంతేకాని సర్వేకు సహకరించాలంటూ చెప్పడం సరికాదంటూ తహసీల్దారుతో సీఐటీయూ జిల్లా నాయకుడు వాగ్వాదం చేశారు. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన

వెంకటాపురం సబ్ స్టేషన్ ఎదుట విద్యుత్ బిల్లుల ప్రతులు దహనం



విద్యుత్ శాఖ ఏఈ జగదీష్‌కు వినతి అందజేస్తున్న సీపీఎం నాయకులు

మునగపాక: స్మార్ట్‌మీటర్లను తక్షణమే తొలగించాలని, లేకుంటే భారీ ఉద్యమం చేపడతామని సీపీఎం నేతలు గనిశెట్టి సత్యనారాయణ, ఆళ్ల మహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని వెంకటాపురం సబ్ స్టేషన్ ఎదుట రైతులతో కలిసి మంగళవారం ఆందోళన నిర్వహించారు. ముందుగా స్మార్ట్‌మీటర్ల కారణంగా వస్తున్న బిల్లుల ప్రతులను దహనం చేశారు. అనంతరం ధర్నా నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ మీటర్లకు రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు బిల్లులు రావడం దారుణమన్నారు. అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను తొలగిస్తామంటూ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అని ప్రకటించి ప్రతి రైతు నుంచి మీటరు ఏర్పాటుకు రూ.13 వేల మేర వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే పంటలకు గిట్టుబాటు ధరలు లేక సతమతమవుతున్న రోజుల్లో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియ మరింత వేదనకు గురి చేస్తుందన్నారు. వెంటనే వాటిని తొలగించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ జగదీష్‌కు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘ నాయకులు ఎస్.బ్రహ్మాజీ, కె.రాము, మురళీకృష్ణ, గోవిందరావు, చిన్ని గోవింద, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు



మునగపాక: వారం రోజులుగా ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. జూలైలోనూ వేసవిని తలపించేలా కాస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం 10 గంటలకే వేడి పెరిగిపోవడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటలు కావస్తున్నా ఎండ వేడి తగ్గకపోవడంతో రాకపోకలు సాగించేవారు పడరాని పాట్లు పడ్డారు. మునగపాక మెయిన్‌రోడ్డు ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా కనిపించింది. మొత్తం మీద వారం రోజులుగా ఎండవేడిమి పెరిగిపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పలేదనడంలో సందేహం లేదు.